# ఆహుతి

వెంకటకృష్ణయ్యగారు మధ్యరకము రైతు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఒక్క కుమారుడు. ఆయన కుటుంబము పూర్వమునుండి చాల గౌరవము గలది. ఆయన భార్య లక్ష్మమ్మ చాల అణకువగల మనిషి. ఉన్నదానితోనే సంతృప్తి పొందుతూ చాల పొదుపుగా వాడుకుంటూ ఉండేది. వారి ఇల్లు అతిథి సత్కారమునకు ఆయువుపట్టు. వెంకటకృష్ణయ్యగారుకూడ చాల మర్యాదగల మనిషి, సత్ప్రవర్తన కలవాడు. వారి పుణ్యఫలమేమో యన్నట్లు వారి సంతతి చాల సౌందర్యముగలది. వారి చిన్నకూతురు "నీరజ" అందములకుప్ప, సుగుణముల రాశి.

"పెండ్లి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు" అన్నట్లు ఈ రోజులలో ఆడపిల్లల పెండ్లి మాటలతో కాదు. ప్రతికన్యాదాతను కట్నముల పెనుభూతము వేధిస్తూ ఉన్నది. పెండ్లి ఈడుకొచ్చినపిల్ల ఉన్నదంటే వారి తలిదండ్రుల గుండెలమీద కుంపటే, వారి వేదనను కన్యాదాతలే తెలిసికొనగలరు. ఆస్తి మన వెంకటకృష్ణయ్యగారిది. కాని వారి గౌరవము వలనను, ఏదో ఇదివరలో నిల్వవున్న డబ్బుతో, ఇంక కొంతపొలము విక్రయించి తన నలుగురి కూతుండ్ల పెండ్లి చేయగలిగెను. పెండ్లికొడుకులు కూడ మధ్య రకము కుటుంబములకు చెందినవారే. అందమైన అమ్మాయిలను చేసుకొనుటలో ఏమీ సంకోచించలేదు.

వెంకటకృష్ణయ్యగారి నాల్గవకుమార్తె శైలజ వివాహమై ఇప్పటికి నాల్గు సంవత్సరములైనది. ఇప్పుడు నీరజకు యుక్తవయసు వచ్చినది. ఈమె రజస్వలై మూడు సంవత్సరములైనది. ఈమె అన్నకు 21 సంవత్సరముల వయసు. కాలేజీలో B. A. చదువుతూ ఉన్నాడు. నీరజ వివాహమును గురించి వెంకటకృష్ణయ్యగారికి విచారము ఎక్కువాయెను. నీరజ వివాహమునకు తండ్రి పడరానిపాటులేదు. ఆమె కొరకు వరాన్వేషణ చేయనిచోటులేదు. ఎక్కడ ఎవ్వరూ నీరజను అడిగినవారేలేరు. "నీరజ" అన్న "రామారావు" చాల సరదాగలమనిషి పట్టుదలగలవాడు. తలిదండ్రుల సుఖమే తన సుఖముగ భావించేవాడు. తల్లి తండ్రుల ఈ విచారము ఆయనను చాల కలత పెట్టుతూ ఉండేది. అందువలన ఆయన తన ఆస్తిలో చాల భాగము తన ముద్దు చెల్లెలకు అప్ప చెప్పుటకు కూడ సిద్ధమయ్యెను.

చిన్న తనమునుండి నీరజను ఇవ్వవలెనని కనిపెట్టుకొనిఉన్న మోహన్ రావు కట్నమునకాశించి వేరొకచోట వివాహమాడెను. ఆయనకు వచ్చు 20 వేల కట్నముమీద వెంకటకృష్ణయ్యగారు ఇచ్చు 5 వేలు తృణముగా తోచెను. "నీరజ" శీల, సౌందర్యములను ఊహించడాయెను. మోహన్ రావు డబ్బుకొరకు శారదను పెండ్లాడినాడేగాని ఆయన మనసు నీరజ సౌందర్యోపాసనే చేయుచుండెను. మోహన్ రావు నీరజకు వేలు తప్పిన మేనత్తకుమారుడే. అదే గ్రామము. ఏదో అదనుచూచి నీరజను పొందవలెనని సమయము కొరకు నిరీక్షిస్తూ ఉండేవాడు.

ఒకనాటి సంఘటన నీరజ తల్లి తండ్రులు, అన్న, గ్రామములో లేరు. గ్రామములో వారి ఇల్లు కొంచెము పెడగా ఉండేది. నీరజ చాలధైర్యము గలది, సాహసముగలది, ఆత్మ విశ్వాసమునకు ఆలవాలము. అదను కొరకు వేచియున్న మోహన్‌కు మంచి సమయము దొరికినది. నీరజను వశపరచుకొనుటకు ఇదేమంచి సమయమని భావించి తనను చాల శృంగారించుకొని పేపరు చేత పట్టుకొని వెంకటకృష్ణయ్యగారింటికి వచ్చెను. ఆ సమయమున నీరజ వరండాలో కూర్చుని ఏదో వ్యాసము వ్రాస్తూయుండెను. అప్పుడప్పుడు మోహన్ వారింటికి వస్తూ ఉండుటవలన నీరజకు మోహన్ రాక బిడియము కలిగించలేదు. మోహన్ నీరజా! నాన్నగారు లేరూ? అనెను. నీరజ లేరంటూనే ఇంట్లోకి వెళ్లిపోయెను. మోహన్ కూడ ఆమె వెంట, ఇంట్లోకి వెళ్లి ఇట్లు ప్రేలమొదలిడెను ——

"నీరజా! రాత్రింబగళ్లు నీ కొరకు పరితపించుచుంటిని. శారదను వివాహమాడుటలో పొరబడితినని ఇప్పుడు గ్రహించితిని. ఇప్పుడు నీ సౌందర్యము నాకవగతమయ్యెను. కలువరేకులవంటి నీ కన్నులు

నన్ను మంత్రముగ్ధుణ్ణి చేయుచున్నవి. నీ రూపము మఱచెదమన్నను మఱపురాకయున్నది. ఎవ్వరూ లేని ఈ సమయమునే నీవు నా కోరిక తీర్చగలవని నీకు నా బాధ తెలుపుటకు వచ్చితిని. నీవు నీ లేత బుగ్గల మీద ముద్దు పెట్టుకొనుటకు ఒక్కసారి స్థానమిమ్ము" అంటూ ఆమెను చేరబోయెను. ఇప్పటివరకు ఈ విపత్కర పరిస్థితికి నిర్ఘాంత పోతూ విగ్రహములాగ నుంచునియున్న నీరజకు తెలివివచ్చెను. ఆమె దూరముగా తొలగి ఇట్లు చీవాట్లు పెట్టెను—

"నీచుడా! విద్యను, రూపమును, గౌరవమును, బాంధవ్యమును కూడ చూడక, చిన్నతనమునుండీ కని పెట్టుకొనియున్న నా తండ్రిని వంచనచేసి ధనాపేక్షచే వేరొకచోట వివాహమాడితివి. ఈ రోజున ఈ విధముగా నన్ను వంచించ ప్రయత్నిస్తుంటివి. ఈ రోజున నన్ను నీధనాపేక్షచేనైన లేక వేరొక విధముగానైన నన్ను పొంద ప్రయత్నిస్తుంటివి. స్త్రీ అనగా ఆటవస్తువని అవసరమైనప్పుడు ఉపయోగించుకొనవచ్చని భావించితివి కాబోలు. నీవు తలచినట్లు స్త్రీ ఆటవస్తువు కాదు. స్త్రీకి మానుషము అస్తిత్వము ఉన్నది. అవసరమైతే అఖండ బ్రహ్మచర్యము గడుపుతూ అవివాహితగానే ఉండగలదు. నేటికిని భారతగౌరవము స్త్రీ శీలముల సద్గుణములవలనే నిలబడియున్నదని జ్ఞాపకముంచుకొనుము. మీవంటి తుచ్ఛులు అమ్ముడు పోతూ ఉంటే మావంటి శీలవతులు బ్రహ్మచర్యవ్రతముతో సమాజములో చైతన్యము తేగలరని నమ్ము. స్త్రీ అంటే బజారులోని సరకులాంటిది, డబ్బుకు లొంగునని తలచితివి కాబోలు. భారతస్త్రీకి ధనముకంటె, ప్రాణంబుకంటె మానమే ప్రధానమని స్ఫురణకు తెచ్చుకొనుము. అవివాహితగా నున్నానని నీ వశమగుదునని తలచితివా? కీర్తివంతమైన నా వంశమును అప్రతిష్ఠపాలు చేయ నమకట్టితివా? ముందు నీవు నాగడపజగి మాట్లాడుము" అని హెచ్చరించెను. కాని కామాంధునకు మంచి చెడుగులు తెలియవుగదా! నీరజ మందలింపులతో మోహన్ మనసు మారదయ్యె. నీరజకు ఏమీ తోచలేదు. దగ్గరలోనే ఉన్న ఒక తప్పాలా తీసుకొని నీరజ బలముకొలది అతని తలమీద కొట్టెను. మోహన్ తల పగిలెను. దానితో మోహన్ యొక్క మోహము క్రౌర్యముగా మారెను. ఆ బాధతో చేయునది లేక మోహన్ స్టేషనుకివెళ్లి, తను దారినపోతూ ఉండగా నీరజ తనను వివాహమాడలేదను ద్వేషముతో రాయి తీసుకొని కొట్టినదనియు తన తల పగిలినదనియు రిపోర్టు ఇచ్చెను.

ఆ సాయంత్రమే నీరజ తలిదండ్రులు ఇంటికివచ్చిరి. జరిగిన సంగతంతయు నీరజ అతి దుఃఖముతో తండ్రికి విన్నవించెను. రాబోవు ప్రమాదమును గుర్తించి వెంకటకృష్ణయ్య చాల భయపడుతూ ఉండెను. ఇంతలోనే పోలీసులు నీరజ కొరకు వచ్చిరి. నీరజ తండ్రి తన మంచితనమువలన, ఊరిలోని వారి సహాయమువలన నీరజను జైలుకి పంపకుండా చేయగలిగెను. కాని విచారణ రోజున నీరజకు కోర్టుకి వెళ్లక తప్పదయ్యె.

ఆ రోజు కేసు విచారణరోజు. మోహన్ రావు ఎవరినో నలుగురయిదుగురు సాక్షులను తీసుకొని కోర్టుకి హాజరయ్యెను. నీరజకు సాక్షులు ఎవ్వరూ లేరు. ఆమెకు దైవమే సాక్షి. ఆ రోజున నీరజ వాగ్ధాటికి జడ్జితోసహా ప్లీడర్లందరు అచ్చెరువందిరి. నీరజ స్టేట్‌మెంటు వింటూ అందరూ చైతన్య రహితులై పోయిరి. మోహన్ బృందము తెల్ల ముఖము వేసినది. నీరజ ముందు మోహన్ సరిగా మాట్లాడలేక పోయెను. ఇతర పెద్దలవలన నీరజ కుటుంబ గౌరవము, మోహన్ నడతను తెలిసికొనిరి. ఆ రోజున నీరజ ఇంట్లో ఎవరూ లేకపోవుట నీరజ వాదనను బలపరచెను. ఈ విషయములన్ని తెలిసికొని కోర్టులో కేసు కొట్టివేయబడెను. పైగా ఒక విద్యావంతుడు ఎవరూలేని సమయము చూచి ఒక మానవతిని చెఱచ ప్రయత్నించినందుకు 5 వేల జరిమానా మోహన్ రావుకు విధించి, ఆ 5 వేలు నీరజ ధైర్య సాహసములకు బహుమతిగా ఇవ్వబడెను. ఆ రోజునే నీరజ భావిజీవితము ఉజ్వలమగునని కోర్టువారందరు తలచిరి.

ఇప్పుడు నీరజ పేరు నలుమూలల మ్రోగెను. ఇదివరలో నీరజ పేరు వినుటకు కూడ పెడచెవిపెట్టిన వారు ఇప్పుడు నీరజను వివాహమాడుటకు ముందుకు వచ్చిరి. కాని ఇప్పుడు నీరజకు వివాహమాడు కోరిక ఏమాత్రము లేదు. ఆమె తన సంఘమును సంస్కరింప నడుముకట్టుకొనెను. తన సమాజములోనున్న కట్నములను పెనుభూతమును రూపుమాప బద్ధకంకణురాలాయెను. తనకు వచ్చిన డబ్బుతో ఇదివరలో S. S. L. C చదివి ఉండుటవలన "ఆమె" త్వరలోనే 'లా' పూర్తిచేయగలిగెను. తన వివాహము చేసిగాని వివాహము చేసికొనను అని పట్టుపట్టిన అన్నకు తన నిశ్చితాభిప్రాయమును దీక్షను విన్నవించి విద్యావతి యగు ఒక కన్యను అన్నకు నిఃశుల్క వివాహము చేసెను.

న్యాయవాది వృత్తిలో ఆమె కొంత సొమ్ము సంపాదించెను. నారీబ్రహ్మచర్యాశ్రమమను ఒక సంస్థను స్థాపించెను. అందులో కొందరు అవివాహిత స్త్రీలను చేర్చుకొనెను. నీరజ ఈ కార్యక్రమమునకు ప్రజలుకూడ తమకు తోచినరీతిన ధన సహాయము ఇతర సహాయములు చేయగల్గిరి. నీరజ ఇప్పుడు తన బృందముతో పరిసర గ్రామములలో నిఃశుల్క వివాహ ప్రచారము చేయ మొదలుపెట్టెను. కట్నములు ఇచ్చి వివాహము చేయవద్దని, కట్నములు తీసుకొనవద్దని పరిపరి విధముల ఈ బృందము కాలి నడకన వెళ్లి ప్రతిగ్రామములోనూ బోధిస్తూ ఉండేది. ఈ విధముగ నీరజ ఆయా గ్రామములలో చాల చైతన్యమును తేగల్గెను. సుషుప్తావస్థలోనున్న భారతీయతను ఢంకా బజాయించి మేల్కొలుపగలిగెను. అనేక నిఃశుల్క వివాహములు చేయించెను. ఈ విధముగా నీరజ తన సమాజమును నీతితో అలంకరించ ఉవ్విళ్లూరుచుండెను. ఈ విధముగా నీరజ తన సమాజమునకు అపారసేవ చేయుచుండెను.

మోహన్ నీరజమీద త్రాచు పగపట్టియుండెను. ఇక ఏవిధముగాను తన వశము గాదని నిరాశ చెందెను. నీరజో, లేక తనో. ఈ లోకములో ఉండవలెగాని ఇద్దరు ఉండుట సంభవము గాదని తలచాడు. ఏదో విధమున తనకసి తీర్చుకొనుటకు సమయము కొరకు వేచియుండెను.

ఒకనాటిరాత్రి నీరజ ఏదో గ్రామమునుండి వస్తూ యుండెను. రాత్రి 8 గంటల సమయము. ఆ దారినరసంచారము ఎక్కువ ఉండేది కాదు. ఆ సమయముననే మోహన్ కూడ ఆమె వెంట వస్తూ యుండెను. అక్కడ ప్రకృతి సౌందర్యము తప్ప వేరొక నరసంచారములేదు. మోహన్‌కు మంచి అదను దొరకినది. ఇదిగో నాకసి తీర్చుకుంటున్నానని బాకు తీసి నీరజ కంఠములో పొడిచెను. నీరజ హారే రామ, హారే రామ అంటూ నేలకొరగెను.

విద్యావతియు, బ్రహ్మచారిణియు, సంఘ సంస్కరణియునగు శ్రీమతి కుమారి నీరజ ఆత్మకు శాంతి చేకూరుగాక!

సూర్యదేవర అన్నపూర్ణాదేవి